# సింహ్వాసెలంగోరి గేదె

ఎండలింకా ముదరకముందే చుట్టూరా కొండలు సెగలు కొడుతున్నాయి. విభూతి పండ్లలాంటి సున్నపుకొండలు దొలుచుకుతింటున్నారు. దరిదాపు నాలుగూళ్ల వాళ్లకి కొండల డొక్కల్లో పొడిచి సున్నపురాళ్లని పొడిచేసుకుని ఊళ్ల మీద అమ్ముకు బతకడం తప్పడం లేదు. అవతలి వేపు భూములు ఎండి ఇంకా ఎర్రబారి గడ్డకట్టిన నెత్తుటిలా ఉన్నాయి. తాండవ ఇసకనదికీ  కొండలకీ మధ్యనున్న గ్రామాలివి. ఎండిపోయిన పొలాలు, ఎండిపోయిన రైతులు, ఎండిపోయిన ఊళ్లు. ఎం.డి.వో గారి జీపు మట్టికొట్టుకపోయిన నీలపు దున్నపోతులా అప్పుడప్పుడు ఒస్తూంటుంది. ప్రభుత్వానికీ ఆ ఊళ్లకీ అదే దున్నపోతు రాయబారం.

ఉదయం పదయింది. పంచాయితీ  ఆఫీసు ముందు భాగాన్ని నాలుగు పెద్ద కానుగచెట్లుపచ్చటి పందిరితో కాపాడుతున్నాయి. లోపల ఎం.డీ.వోగారు, ఎమ్మార్వోగారు ఇతర ఉద్యోగులు నలుగురూ పైన ఫేను తిరుగుతున్నా ఉప్పుకుండల్లా చెమరుస్తున్నారు. ఎమ్మార్వోగారి బట్టతల పల్చటి నీటిబుగ్గలా ఉంది. ఎం.డీ.వోగారు కిటికీ అడుగు భాగాన్ని కప్పిన తెరసందులోంచి బయటికి చూసి గతుక్కుమన్నారు. క్షణం ఆగి అన్నారు.

“సరే మీరెళ్లండి. ఆ ఎస్సైకి మళ్లీ కబురుపెట్టండి. తాగి ఎక్కడున్నాడో.”

“ఒచ్చేస్తారు సార్. మనకింకా టైముంది గదండి.”

“టైమా? ఆ ముండ దెయ్యంలా అక్కడ్నించి కదలడం లేదు. మన టైం అయిం తరవాత వస్తారా పోలీసులు?”

వాళ్లు బయటికి వెళ్లిపోయారు. ఎం.డీ.వో.గారూ ఎమ్మార్వోగారూ ఒకరి తడి మొహాలు ఒకరు చూసుకున్నారు.

“సరే మీరోసారి మాట్లాడి చూడండి ” ఎం.డీ.వో గారన్నారు.

“ఏం లాభం? ఉదయం కబురంపేను. ఇల్లు, లేవెట్రీ ఇంకా ఏవేనా లోన్లుంటే

అన్నీ ఇప్పిస్తానని చెప్పేను. బేంకు లోను కావాలంటే చెప్తానన్నాను."

"విన్లేదా?"

"అసలు మనిషిని చూడగానే దెయ్యంలా మీద పడుతోంది. అది నోరు తెరిచిందంటే ఎదర నిలబడే మగాడీ జిల్లాలో ఉం డడు. ఆశ్చర్యం. అసలాడదానికి అన్ని బూతులెలా వస్తాయండీ?"

నవ్వేరు ఎం.డీ.వోగారు. నిట్టూర్చి అన్నారు.

"కడుపు మండితే మీకూ వస్తాయి."

బయట ఆఫీసు ముందు వెలిసిపోయిన షామియానా కింద ఒక వేదిక, దానిమీద నాలుగు కుర్చీలు సిద్ధగా ఉన్నాయి. జనం కూచోడానికి రకరకాల రంగుల్లో ఉన్న ప్లాస్టిక్, రేకు కుర్చీలు వేశారు. ఊరి జనం కొంతమంది అప్పటికే కుర్చీల్లో కూచుని గేట్లోంచి బయటికి చూస్తున్నారు.

ఎమ్మెల్యేగారు రావడానికి చాలా టైము పడుతుందని తెలిసి కొందరు ఇళ్లకి వెళ్లిపోయారు. పంచాయితీ ఆఫీసుకి చిన్న గోడ, లోపలికి రావడానికి ఒక గేటూ ఉన్నాయి. గేటు బయటికి తీసి ఉంది. గొల్ల సింహాచలంగారి గేదె గేటుకి కట్టేసి ఉంది. దాని ముందు పడేసిన నాలుగు పరకలూ ఎప్పుడో తినేసింది. గేటుబయట సన్నటి రోడ్డు కవతల చెట్టుకింద కూచుంది సింహాచలం. ఆమె చుట్టూ ఆడవాళ్లు కొంతమంది దడికట్టి నుంచుని ఉన్నారు. రేకు కుర్చీతో లోయలోంచి వచ్చి కూచున్న తలుపులమ్మలా ఉందామె. నూనెతో మెరుస్తోన్న పుష్కలమైన జుట్టు బలంగా వెనక్కి దువ్వి ("ఎదవ సెక్క దువ్వెన్న") తలకి ఓ పక్కన పెట్టుకున్న కొప్పు, అందులో ఎర్రమందారం, మోకాళ్ల దగ్గిరికి ఎగకట్టిన నీలం చీర, పెద్ద ఎర్రకుంకుమబొట్టు, ముక్కుపుటాల మధ్య ఉంచి వేలాడుతున్న సన్నటి బంగారు సున్నా... కొంచెం గుండ్రటి ముఖం, ఓ కాలికి ఎందుకో చుట్టుకున్న నల్లతాడు- ఆమె అంటే ఊళ్లో గొల్లలందరికీ కాపులకీ కూడా నిక్కచ్చి మనిషని పేరు. సింహాచలానికి మూడున్నర ఎకరాల పొలం ఉంది. అప్పుడప్పుడు పండు తుంటుంది. ఇద్దరు కూతుళ్లకీ రెండు గేదెల్ని అమ్మి పెళ్లి చేసి పంపించేసింది. షామియానా కింద కొడుకూ, గోడపక్కన మొగుడూ కబుర్లాడుతున్నారు.

ఎండలతో నిమిత్తంలేకండా ఊరు వారంరోజుల్నించీ ఉడికిపోతోంది. ఊళ్లో నాలుగు వృద్ధాప్యపింఛన్లూ, దారిద్ర్యరేఖకి కింద బహిర్భూమికి కూచుంటున్నవాళ్లకి కొన్ని సాయఖానాలు ఎమ్మెల్యేగారు సభ పెట్టి ప్రకటిస్తున్నారని దండోరా వేయించారు ఎమ్మార్వోగారు. ఆ సాయంకాలం నుంచి మొదలేసింది సింహాచలం. సర్పంచి నానికాపుగారింటికి వినబడుతున్నాయి. వినబడని వినకూడని మాటల్ని మిగిలుంటే ఏరుకొచ్చి నానికాపు దగ్గిర పోస్తున్నారు.

"అంటే ఆవిడి తరపున గొడవెట్టుకుంటే మంచోడూ లేకపోతే యెదవా అన్నమాట" అన్నాడు సర్పంచిగారు.

"అదేగదండి మరి" అన్నాడో పంచాయితీ నంబరుగారు.

"ఆవిడైలాగు తప్పంటారా కాదా? ఆడది ఆడదాన్లాగా మగోడు మగోళ్లాగా మాటాడితే మర్యాద్దక్కుద్ది. మరి, నేనూ కాపోడికే పుట్టేను."

"బలేటోరే మాకు తెల్దేటండి."

"అంటే ఆడంగుల్ని పోగేసుకుని మీటింకాడ గొడవెట్టుకుంటదంటగా?"

"అయిడియా అదేనండి".

నానికాపు చుట్ట వెలిగించేడు. సర్పంచిగారి నల్లగచ్చు వసారాలో కూచున్నారు నలుగురూ. నానిగారికి వరసకి అన్నపుతాడు రేగినాయుడు. అతనన్నాడు.

"కాపోళ్లూ గొల్లోళ్లూ గొడవగాదుగా నోరే, సింవాచలం అన్నదాంటో సబవుంది. నీకూ నాకూ ఈడికీ పొలం ఉంది. గొల్లదాని గొడవ మన్దిగాదంటం కరెక్టయిన మాటకాదబ్బాయ్."

"అంటే ఆవిడిగారు మీటింకాడ సీరెత్తుకుని డేన్సు కట్టినా పర్లేదా?"

"అబ్బెబ్బే. కోపం పడకు మరీ. ఏరా నువు జెప్పు. ఆవిడి సవస్య ఏటంటావు?"

"... రేగినాయుడన్నాదీ మరి కరక్టే గదా."

మరికొంతసేపు సబవు గురించి చర్చ జరిగింది. ఈలోపల గ్లాసుల్లో పల్చటి తియ్యటి టీ ఒచ్చింది. ఒక గేదెవల్లా, సింహా చలంవల్లా అనవసరంగా "ఎగస్పార్టీ" చేసుకోడం అనవసరం అని తేలిపోయింది మీటింగు దగ్గర గొడవైనా అల్లరైనా సర్పంచి పరువేపోతుందని నిర్ణయించారు. మరో పది నిముషాల తరవాత "ఒయసులో పెద్దోడు" గనక రేగినాయుడే వెళ్లి మాటాడాలని తీర్మానం అయింది.

"రండి బావూ, ఇలగొచ్చేరేటీ?"

కూచోడానికి పందిరి కింద మంచం లాగింది సింహాచలం. పదిహేను నిముషాల తరవాత రాయబారం విఫలం అయి పోయింది. నాయుడుగారికి విచారం కలగలేదు.

"....నే నన్నాదాంటో తప్పుంటే సెప్పుచ్చుకొట్టండి. ఇయ్యాల నాకవుద్ది. రేపు ఇంకోళ్లకిత్తారా లేదా? ఇప్పించిన ఎదవకీ ఇచ్చిన ఎదవకీ గేనం ఉందంటారా? కితం ఏడాదిలాగే మీటింగెట్టి గేదె నప్పజెప్పి పోటోలు దిగేరు. సర్పంచిగారిచ్చేరన్నానా? గవ మెంటోడిచ్చేడు. గవమెంటోడికి సర్పంచిగార్ని సెప్పమనండి. తప్పంటారా?"

దారంటా నవ్వుకుంటూ వెళ్లిపోయాడు రేగినాయుడు. నానికాపు అగ్గయిపోయాడు. మూడోరోజు ఎమ్మార్వోగారు పంపించిన లోన్ల రాయబారం కూడా పనిచెయ్యలేదు.

సరిగ్గా ఏడాదిక్రితం మీటింగులుపెట్టి మండలంలో లబ్దిదారుల్ని ఎంపికచేసి అందరికీ గేదెల్ని పంచిపెట్టింది జిల్లా యం త్రాంగం. ఆస్ట్రేలియాలో పుట్టి పెరిగి హర్యానాలో కొన్నాళ్లు కాలక్షేపం చేసింతరవాత కొన్ని గేదెల్ని ఆంధ్రదేశానికి తరలించేరు. నున్నగా నల్లగా బలంగా అందంగా ఉన్న గేదెని చూడగానే సింహాచలానికి నీళ్లోసుకున్న కూతుర్ని చూసినంత సంబరం కలిగి మొహం ఇంతయిపోయింది. భారీ శరీరం గనక పూర్తిగా ఒంగి ఎమ్మార్వోగారికి దణ్ణం పెట్టలేక కృతజ్ఞతాభావంతో చేతులెత్తి నమస్కరించిందామె. రోజుకి ఆరేడులీటర్ల పాలిచ్చే గేదెకి పసుపురాసి, బొట్టుపెట్టి 'అమ్మా లచ్చిందేవి' అనుకుంటూ ఇంట్లో కట్టుకుంది. అయితే గేదె విదేశీ పౌరసత్వం గరించి సింహాచలానికి తెలీదు. ఆరోనెల దాటకుండానే సింహాచలం ఇల్లూ ఒళ్లూ గుల్లయిపోయాయి. కొడుకు కూలిపన్లు మానేశాడు. ఓ మాదిరిగా కాలక్షేపం అయిపోయే ఇల్లు గడవడం కష్టం అయిపోయింది. ఊరంతా సన్నకారు రైతులు. జరిగిన అన్యాయం బక్క రైతులందరికీ తెలిసిపోయింది.

లచ్చిందేవనుకొన్న గేదె నాలుగు కాళ్ల నల్లటి కరువులా తయారైంది. ("ఏం పొయ్యేకాలవోగానొరే మనకి గవమెంటోడు దయిద్రం అంటగట్టేడు") ఎమ్మెల్యేగారి ముందు పరువుపోతుందని ఎమ్మార్వోగారికీ, ఎమ్మార్వోగారి ముందు పరువుపోతుందని సర్పంచిగారికీ అర్ధమైపోయింది. మీటింగు పన్లు చూసినట్టూ ఉంటుంది. సింహాచలంగార్ని కలిసినట్టూ ఉంటుందని ఎమ్మార్వోగారు ఊళ్లోకొచ్చేరు. ముందు కబురంపగానే పొలానికెళ్లిందన్నారు. సాయింత్రం నాలుగ్గంటలకి ఎమ్మార్వోగారు, సర్పంచిగారు, పరివారం పంచాయితీ కానుగుచెట్టు కింద కూచుని ఉన్నారు. గేటు తీసుకుని ఒచ్చింది సింహాచలం. కోపంగా, వేగంగా నడిచిందేమో ఆమె చెమటతో తడిసిపోయింది. ముఖం చెమటవేసిన కోపంతో మెరిసిపోతోంది.

కొంగుతో ముఖం తుడుచుకుని అందామె.

"పిలిపించేరంట గదండయ్యిగారూ, దణ్ణాలండి" సూటిగా చూస్తూ నుంచుంది. చాలా నెలల తరవాత ఎమ్మార్వోగారికి ఎంత ఆలోచించినా సింహాచలంచూపు కోపంవచ్చిన కలెక్టరుగారి చూపుకంటే ఎందుకు గాయపరుస్తుందో అర్థంకాలేదు. ఎంత ఆగ్రహంలో ఉన్నా కలెక్టరుగారి ముఖం చూడ్డానికి ఆయనకి ఇబ్బంది అనిపించలేదు. ఏ క్షణంలో అయినా పేలిపోయే నాటుబాంబులా ఉందామె. ఎమ్మార్వోగారికి వెంటనే నోటమాట రాలేదు.

"ఊ. ఇపుడూ, సమస్యలనేవి ఎవరికేనా వస్తాయి. ఏటమ్మా? మాతో మాటాడాలిగానీ పెద్దవాళ్లున్నప్పుడు ఇష్టం వచ్చినట్టు మాట్లాడతానంటే తప్పుగదా? ఇక్కడ మేం ఎందుకున్నాం చెప్పు? మీ కిబ్బందులుంటే మాతో చెప్పండి. మీటింగులో గొడపెట్టుకుంటా నంటే మా పెద్దవాళ్లు మాత్తరం ఊరుకుంటారా? ఏటమ్మా?"

సింహాచలం భల్లుమని పేలిపోయింది.

"ఎవురండీ పెద్దోలు? ఓట్లెలకస్నల్లప్పుడు డబ్బులిచ్చి మళ్లీ కావడకుండా పోయినోల్లంటారా? అయన్నీ మా కొద్దండి. కితం ఏడాదేనాండి, మీటింగు గట్టా పెట్టి గేదెల్నిచ్చేరా? ఏటండయ్యి? గేదెలా దెయ్యాలా? పాలసంగతి దేవుడెరుగు, తింటానికి గడ్డేదండి? మేట్లు మేట్లు తినేత్తదండి. ఎంత తింటే అన్ని పాలిత్తయ్యండి ఆ జాతులు. మనకాడ పనికి రావండి. తాళ్లోతున ఈడ సుక్క నీళ్లు లేవండి. ఇంగితం లేదేటండి? సుక్కనీరు లేనికాడ ఇసుమంటి గేదెల్నిచ్చి సేతులు దులిపేసుకున్నారండి. అసలా అన్నావోడెవడండి? ఈటికి సల్లటి ఓతావర్నం గావాలండి. ఈడ బతకలేవండి. సత్తయ్యి. కడుగేటండి. తౌడేటండి ఎంత తింటే అంత మేతెయ్యాలండి. పుస్కలంగా గడ్డీ నీరూ ఉన్న కాడ ఉండాలండయ్యి. దీన్ని తెచ్చుకున్నా కాన్నించి మేపడంతో సరిపోయిందండి. నా కొడుకు కూలికెల్లడం మానేసేసి దీన్ని మేవతన్నాడండి. ఏడకల్లిమేపతాడండి? గడ్డేది? ఏడుందండి గడ్డీడ? సుబ్బరంగా ఓ పూటేనా తినే ఓల్లం. బుద్దిలేని గవమెంటోడి దయండి. దయిద్రం పట్టుకుందండి. మెట్టపాలాల్లో నీల్లు లేనికాడ ఈ గేదెలేటండి? అసలు గేనం ఉందాండి ఆరికి? తింటానికి మేత లేక గేదె సచ్చీరుకుంటందండి. ఆ ఉసురుకొట్టుద్దండి. ఇదోండి, రేపు మీటింగంట గదా? గేదెని ఈ గేటుకి కట్టి మీటింగులో అడుగుతానండియ్యన్నీ. ఏం చేత్తారో సూత్తానండి. పీకతీసి మెలేత్తారా? మాకీ గేదెలూ ఒద్దండి, మీరూ ఒద్దండి. మా సావు మేం సత్తాం గానండి సెలవండి", గేట్లోంచి సుడిగాలి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన పదిహేను నిముషాల వరకూ ఎమ్మార్వోగారు కోలుకోలేదు. సర్పంచి కాపుగారికి తెరిచిన నోరు మూతబడలేదు. మొన్నటి సంగతది.

ఎం.డీ.వో. గారన్నారు :

"ఏం చేద్దావంటారు?"

"మళ్లీ పిలిపించి ఓసారి మీరు మాట్లాడండి. అదేం బెదిరింపులకి లొంగే ఆడది కాదు."

"సరే పిలవండి. ఆయనొచ్చే ముందే తేల్చుకంటే మంచిది" అంటూ ఆయన సీనియరు అసిస్టెంటు వేపు చూశారు. అతనన్నాడు.

"నేనిందాకనే వాకబు చేశాన్సార్. అది ఎవర్నీ లెక్కజేసే స్థితిలో లేదండి."

"అయితే ? మీటింగులో అల్లరవకుండా చూడాలి ముందు."

"దీనికి ఒకటే విరుగుడు సార్."

"మరిందాక చెప్పొచ్చుగదా?" మాటలకి బదులు అనేక అర్థాలకి అవకాశం ఉండే ఒక చిన్న నవ్వు, చిన్న ప్రభుత్వోద్యోగులు అధికారుల ముందు తెచ్చుకునే ఒక

గవర్నమెంటు నవ్వు నవ్వి అన్నాడు

"ఇవాళ హెల్తుసెంటరు డాక్టరుగారున్నారండి. ఆయనకి కబురెట్టాలండి."

"ఎందుకూ?"

సీనియర్ అసిస్టెంటు వివరించేడు. వెంటనే వెళ్లి పదినిముషాల్లో తిరిగొచ్చేడు జీపుడ్రైవరు. కాస్త ఊపిరందింది అందరికీ. మరో అరగంట తరవాత ఎమ్మెల్యేగారి జీపు రావడం అందరూ లోపలికి రావడం జరిగిపోయింది. ఎమ్మెల్యేగార్ని దృష్టిలో పెట్టుకుని కాకపోయినా సింహాచలంగారి గేదె గేటు దగ్గిర మరోసారి ధారాళంగా పేడవేసింది. అప్పటికే ఉదయం నుంచీ రొచ్చుగా తయారయి లోపలికి అడుగుపెట్టడానికి కష్టం అయిపోతోంది. ఆయన జీపులో వచ్చేరు గనక ఇబ్బంది కలగలేదు.

అందరికీ ఆఫీసులో కూల్‌డ్రింకులు అందించారు సర్పంచిగారు.

"ఆలస్యం అయిపోతుంది. ఇదేదో అయిపోతే బోయినం తునిలో. లబ్ధిదారులున్నారా?" అన్నారు ఎమ్మెల్యేగారు.

"ఉన్నారుసార్. ఇద్దరు ఎస్సీలు, నలుగురు బి.సిలు సార్. మేం రెడీసార్.. ఓ చిన్న రిక్వెస్టు సార్.."

"అదా? దానికేవుంది, పిలిపించండి."

అప్పటికి పంచాయితీ ఆఫీసు ఆవరణలోకి వచ్చింది సింహాచలం. మూర్ఛపోయిన సేన మధ్య రౌద్రంలో ఉన్న అమ్మోరిలా నుంచుందామె. సీనియరు అసిస్టెంటు రమ్మని చెయ్యి ఊపేడు.

"ఎమ్మెల్యేగారు పిలుస్తున్నారండి. కాదనకండి. బాగోదు మరి."

"మాకు చీర్రెట్లు గట్రా లేవండి. ఈణ్నే పబ్లిగ్గా అడుగుతానండి."

"అడగండి. రమ్మన్న తరవాత రానంటే బాగోదు రండి చెప్తాను."

ఎర్రగా చూసిందామె. "పదండి. బయవేటండి?"

ఆఫీసు వెనక వరండాలోకి తీసికెళ్లి గోడకి చేర్చి ఉన్న బెంచీ మీద "కూచోండి వస్తా"నన్నాడు అసిస్టెంటు. క్షణంలో స్టీలు గ్లాసులో కూల్‌డ్రింకుతో తిరిగొచ్చేడు.

"ముందు చల్లగా ఇది తీసుకోండి. పిలిపిస్తాను."

"మాకెందుకండియ్యన్నీ." చిరుకోపం తెచ్చుకుని సీనియరు అసిస్టెంటు అన్నాడు.

"పెద్దాయన ఇమ్మన్నారండి. పోన్లెండి ఇష్టంలేకపోతే పారేసెయ్యండి" అని లోపలికి వెళ్లిపోయాడు.

చేతిలో పట్టుకున్న గ్లాసు చల్లగా ఉంది. రెండు చుక్కలు రుచి చూసి గ్లాసెత్తి

మొత్తం గొంతులో పోసుకుని చల్లటి స్టీలు గ్లాసుని నుదుటికి ఆనించుకుంది. గొంతులోంచి చల్లగా దిగింది డ్రింకు. మరో పదినిముషాల్లో బయట మీటింగు మొదలైంది. అప్పటికి సింహాచలానికి రెప్పలు బరువెక్కిపోయాయి. అందరూ బయటికి వెళ్లిన తరవాత సీనియరు అసిస్టెంటు వరండాలోకి వచ్చి చూసి నవ్వుకుని వెళ్లిపోయాడు.

గంటలో మీటింగు అయిపోయింది.

ఎమ్మెల్యేగారు, ఎం.డీ.వోగారు వెళ్లిపోయారు.

వెనక వరండాలో బెంచీమీద సింహాచలం గుర్రుపెట్టి నిద్రపోతోంది.

బయట గేటుకి కట్టేసిన గేదె ఎండలో ఉడికిపోతూ అరుస్తోంది.